క్లుప్తంగా

పరామర్శ



వెంకట అప్పారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధారబోయిన వెంకట అప్పారావు తల్లి నారాయణమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం గ్రామానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, నాయకులు ధారబోయిన ధర్మరాజ్, రెయ్యిమ్మ, దోల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

సాగునీటి ఎన్నికలకు ఏర్పాట్లు



ఎన్నికల నోటిఫికేషన్ అతికిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఈనెల 14న జరగనున్న సాగునీటి ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జి.సిగడాం జోనల్ అధికారి అరసాడ రవి సమక్షంలో ఎన్నికల పంచాయతీ కార్యాలయంలో నోటిఫికేషన్ బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తులసీప్రసాద్‌సాహు, పాట్నారు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం శుభకరం



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న దృశ్యం

గార: సర్వ మానవాళికి భగవద్గీత పఠనం శుభకరమని సర్పంచ్ బి.లలిత అన్నారు. బుధవారం గీతా జయంతిని పురస్కరించుకొని బుద్ధా స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుని స్మరిస్తూ గీతా జయంతి ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బి.ఎర్రన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పాఠశాలలో సంపత్ వినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంత పరిశుభ్రతపై అవగాహన కల్పించి ఉచితంగా మందులు అందజేశారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళంకల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంచేసిన లక్ష్మీగణపతి ఆలయ పునర్నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షిర్డీసాయి సేవా సంఘం సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజలు చేసి పనులు చేపట్టారు. ఆలయ ముందరి భాగం పూర్తిగా పాడైపోవడంతో వర్షాకాలం, ఎండాకాలంలో కార్యక్రమాలకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరు సీఐల బదిలీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ విశాఖ రేంజి డీఐజీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. కాశీబుగ్గ అర్బన్ సీఐగా ఉన్న దాడి మోహనరావును జిల్లా స్పెషల్ బ్రాంచికి, స్పెషల్‌బ్రాంచిలో ఉన్న పి.సూర్యనారాయణను కాశీబుగ్గ అర్బన్‌కు బదిలీ చేశారు.

సాయికిరణ్‌కు పీహెచ్‌డీ



పట్టా తీసుకుంటున్న సాయికిరణ్

జి.సిగడాం: మండలంలోని ఎస్పీఆర్‌పురం గ్రామానికి చెందిన కంది సాయికిరణ్ జియాలజీ విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో సైన్సెస్‌కు సంబంధించిన జియాలజీ విభాగం ఆధ్వర్యంలో పీహెచ్‌డీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని కోస్టల్ జలాశయాల్లో ఉప్పునీటి చొరబాటు, భూగర్భ జల నాణ్యత, మూల్యాంకనంపై రిమోట్ సెన్సింగ్ అండ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను ఉపయోగించి సమగ్ర అధ్యయనం అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈయనకు గైడ్‌గా ప్రొఫెసర్ కె.నూకరత్నం వ్యవహరించారు. సాయికిరణ్‌ను ఎచ్చెర్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు, మాజీ ఎంపీపీ మీసాల లక్ష్మి, ఎస్పీఆర్‌పురం గ్రామ సర్పంచ్ కంది రమాదేవి అభినందించారు.

మొక్కజొన్నపై మక్కువ..!

- రబీలో విస్తారంగా సాగు
- 4,800 ఎకరాల్లో పంట
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట



విస్తారంగా సాగవుతున్న మొక్కజొన్న

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని రైతులు రబీలో మొక్కజొన్న సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇతర ఆరుతడి పంటలకు బదులుగా మొక్కజొన్నపైనే మక్కువ చూపుతున్నారు. దీనిలో భాగంగా పంటను పొలాల్లో వేసుకునేముందు వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోజకవర్గంలో జి.సిగడాం, లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో సుమారుగా 4,800 ఎకరాల్లో మొక్కసాగు చేస్తున్నారు. జి.సిగడాంలో 1,200, లావేరులో 1,500, రణస్థలంలో 1,200, ఎచ్చెర్లలో 900 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంట సాగు చేస్తే ఎకరాకు సుమారుగా 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ పంట సాగుతో రైతుకు ఎటువంటి కష్టం లేకుండా అధిక దిగుబడులు సాధించగలమని ధీమాగా ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు

రబీ మొక్కజొన్న పంటలో ఎక్కువగా గులాబీ కాండం తొలిచే పురుగు రెండు మూడు వరుసల్లో ఆకు మొదలు, కాండం మధ్య గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లు నాలుగైదు రోజుల్లో ఎదిగి పిల్ల పురుగులా మారుతాయి. మొదటి దశలో మొవ్వను రంధ్రం చేసి అంకురానికి చేరడం వల్లన పొడగాటి రంధ్రాలు ఏర్పాటు అవుతాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వలన మొవ్వ పాడైపోయి మొక్క చనిపోతుంది. దీని నివారణకు మోనో క్రోటోఫాస్ 1.6 మి.లీను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతిని బట్టి 20–25 రోజులకు కార్బోఫ్యూరాన్ 3 కిలల గుళికలు ఎకరాకు వేయాలి. మొక్కకు 6 గుళికలు పడేలా రైతుకు అవగాహన ఉండాలి.

కలుపు నివారణ

వరి పొలంలో భూమిని దుక్కుదున్నడం చేయకపోతే కలుపు ఎక్కువగా వస్తుంది. దీని నివారణకు ఒక్క కిలో అట్రాజిన్ 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కోసిన వరిదుబ్బు మొలకెత్తకుండా ఉండటానికి లీటరుకు 5 మి.లీ చొప్పున పారాక్వాట్ మందును నీటిలో కలిపి, విత్తిన మరుసటి రోజు పిచికారీ చేయాలి. అట్రాజిన్, పారాక్వాట్ కలిపి కూడా పిచికారీ చేయవచ్చు.

ఫలితం ఉంటుంది



గత నాలుగు సంవత్సరాలుగా మొక్కజొన్న సాగు చేస్తున్నాను. సుమారుగా 6 ఎకరాల్లో ఈ పంట వేశాను. ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో మొక్కజొన్న పంటపై దృష్టి పెట్టాను. ప్రతిఏటా ఎకరాకు సుమారుగా 30 బస్తాల నుంచి 35 వరకు దిగుబడి సాధిస్తున్నాం. కష్టానికి తగిన ఫలితం ఉంటోంది.

– మక్క లక్ష్మంన్నాయుడు, పెంట, జి.సిగడాం

సలహాలు తీసుకుంటున్నారు



సీతంపేట, గేదెలపేట, నక్కపేట, పెంట గ్రామ రైతులతో పాటు మండలంలోని పలు గ్రామాల రైతులు సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లోకి వెళ్లి వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు అనువైన పంటలను గుర్తించి పంట పొలాల్లో వేయిస్తున్నాం.

– వై.శారద, ఏవో, జి.సిగడాం

విద్యుత్ స్తంభం ఏర్పాటు



జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న కొయ్యరాళ్ల జంక్షన్‌లో ఈనెల 8వ తేదీన లారీ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం ఒరిగి పాడైంది. దీంతో 33 కేవీ లైన్ విద్యుత్ నిలిపివేశారు. ఆ స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయడం బుధవారం పూర్తయ్యింది. దీంతో విద్యుత్ లైన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు చెప్పారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ప్రీ క్రిస్మస్ వేడుకలు



శ్రీకాకుళం నగరంలోని తురాయి చెట్టు వీధిలో బొండాడ దుర్గారావు ఇంటి వద్ద ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కటింగ్, క్యాండిల్ లైట్ సర్వీసు, క్రీస్తు సందేశం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, క్రైస్తవులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

పొలం పిలుస్తోంది



వాయుగుండం ప్రభావం కారణంగా వరి కోతలను రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని, వనలను కుప్పలు పెట్టుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ కె.త్రినాథస్వామి సూచించారు. మండలంలోని లింగాలవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. జీరో టిల్లేజీ పద్ధతిలో మొక్కజొన్న నాట్లు వేస్తున్న రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఏడీఏ బగ్గు రజిని, రైతులు ఉన్నారు.

– గార

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచి, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని సంఘం గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు శ్యామలరావు, కార్యదర్శి సతీష్‌లు ప్రభుత్వాన్ని కోరారు. గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత సదుపాయాల కింద రూ.10 లక్షలు ఇవ్వాలని, విధి నిర్వహణలో భాగంగా చనిపోయిన కార్మిక కుటుంబాల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, వారాంతపు సెలవులు, జాతీయ పండగ సెలవులు అమలు చేయాలన్నారు. పెరుగుతున్న పని భారాన్ని తగ్గించి, అదనంగా కార్మికులను చేర్చుకోవాలని, ఐడీ కార్డులు, రెయిన్ కోట్లు, యూనిఫారాలు, పనిముట్లు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, ఉపాధ్యక్షులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారధి, రామచంద్ర, రామారావు, మణి, ముకేష్, శ్రీను, త్రినాథ్, బి.సతీష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నీ పరిశీలకుడిగా భాస్కర్



ఉత్తర్వుల ప్రతిని భాస్కర్‌కు అందజేస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: కర్ణాటక రాష్ట్రం మణిపాల్ అకాడమీ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ సంస్థలో ఈ నెల 13 నుంచి 16 వరకు జరగనున్న అఖిలభారత అంతర టెన్నిస్ టోర్నీ పరిశీలకుడిగా డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎ.భాస్కర్ ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకులు ఉత్తర్వులను మెయిల్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా భాస్కర్‌ను వీసీ కె.ఆర్.రజిని బుధవారం అభినందించారు.

అందరి సహకారంతోనే గ్రామాల పరిశుభ్రత

- శ్రీకాకుళం డివిజనల్ పంచాయతీ అధికారి రమణ



జి.సిగడాం: చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ



ఎచ్చెర్ల: చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

జి.సిగడాం: గ్రామాలను ప్రజలందరీ సహకారంతోనే పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చని శ్రీకాకుళం డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ అన్నారు. మండలంలోని ఎందువ గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలతే సంబంధిత గ్రామ కార్యదర్శి, ఏఎన్ఎంలు బాధ్యత వహించాలన్నారు. శీతాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఏర్నేన జ్యోతి, తులసీ ప్రసాద్ సాహు, జాడ వెంకటన్నాయుడు, పి.సురేష్‌కుమార్, వడగా గౌరీశంకరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజూ చెత్త సేకరణ చేపట్టాలని డీఎల్‌పీవో ఐవీ రమణ సూచించారు. లావేరు మండలంలోని లావేరు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను సేకరించి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేయాలని సూచించారు. తయారు చేసిన వర్మీ కంపోస్ట్ అమ్మకాలు చేపట్టాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ వి.విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్‌పై ఫిర్యాదు సరైనది కాదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గరిమెళ్ల ప్రెస్‌క్లబ్‌లో చొరబడడానికి కొంతమంది జర్నలిస్టుల ముసుగులో ప్రయత్నాలు చేస్తున్నారనే తప్పుడు ఆరోపణలతో ఎస్పీకి చేసిన ఫిర్యాదు సరైనది కాదని సీనియర్ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్.ఈశ్వరరావు, జగదీష్, బాలకృష్ణ, మొదలవలస వాసు, కుంచె చిన్నారావు, ఎస్.నవచైతన్య, చౌదరి సత్యనారాయణ, జీవీ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ: మార్చి 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు పాఠశాల విద్య ఉన్నతాధికారులు బుధవారం షెడ్యూల్ వెలువరించారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి సుమారు 28 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా పాఠశాల విద్య అధికారులు 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు.

వర్సిటీ భాగస్వామ్యం పెరగాలి

ఎచ్చెర్ల క్యాంపస్: వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమంలో వర్సిటీకి మెరుగైన భాగస్వామ్యం ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజని అన్నారు. అధికారులతో పాలక మండలి సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో వర్సిటీ పాత్ర కీలకమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ ఫోరం సమావేశాలు నిర్వహించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు పక్కాగా అమలు కావాలని చెప్పారు. పరిశోధన వ్యాసాలకు బోధన సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

భగవద్గీతతో సమస్యలకు పరిష్కారం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిష్మందిరం ఆధ్వర్యంలో గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా భగవద్గీత సప్తాహంలో బుధవారం 'సమస్యల పరిష్కారం–భగవద్గీత' అనే అంశంపై ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా వక్త స్వామి పరాత్మానంద సరస్వతీ మాట్లాడుతూ మానవుని జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు, తద్వారా మానవుని లక్ష్యం చేరుటకు ఉపకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మా నగేష్, నిక్కు అప్పన్న, కోమల రావు, ఎం.మోహనరావు, ఇప్పిలి ప్రభాకరశాస్త్రి, పతంజలి శాస్త్రి, నిష్టల నరసింహమూర్తి, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేరళ ప్రజలకు అండగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేరళ ప్రజలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకుడు కె.శ్రీనివాస్ అన్నారు. నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేరళ సంఘీభావ సభను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అధ్యక్షతన సీఐటీయూ, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ కేరళ ప్రజల హక్కులు పరిరక్షించాలని, ప్రత్యామ్నాయ వామపక్షాలను బలోపేతం చేయాలని నినదించారు. కేంద్ర ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ముఖ్యంగా కేరళలోని సీపీఎం నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రభుత్వానికి అనేక ఆటంకాలు, అడ్డంకులు సృష్టించిందన్నారు. కేరళపై కక్షగట్టి లక్ష కోట్లకు పైగా రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వకుండా కుయుక్తులు పన్నుతోందని దుయ్యబట్టారు. ఇటువంటి చర్యలను ఇప్పటికైనా విడనాడాలని సూచించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, కె.సూరయ్య, జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, నాయకులు కె.గోపి, టి.ప్రవీణ, ఎస్.బలరాం, ఎల్.రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో గీతా జయంతి వేడుకలు



ఇస్కాన్ మందిరంలో గీతాయజ్ఞం



డీసీసీబీ కాలనీలో గీతా పోటీల్లో గెలిచిన చిన్నారులు



బలగ హరేరామ మందిరంలో సామూహిక పారాయణలు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో గీతా జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో సామూహిక భగవద్గీత పారాయణలు జరిగాయి. ఆలయ అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే పొన్నాడ బ్రిడ్జి వద్దనున్న ఇస్కాన్ మందిరంలో గీతా జయంతి పురస్కరించుకొని గీతా యజ్ఞం జరిగింది. మందిరం నిర్వాహకులు లక్ష్మీపతి గౌడ్ ఆధ్వర్యంలో గీతాపారాయణ నిర్వహించారు. శ్రీనివాస గోవింద ప్రభు ఆధ్వర్యంలో గీతాయజ్ఞంను డాక్టర్ అమ్మన్నాయుడు దంపతులచే నిర్వహించారు. భగవద్గీత పుస్తకాలను శివకుమార్ దంపతులు ఉచితంగా అందించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. అదేవిధంగా డీసీసీబీ కాలనీలోని భూసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గీతా జయంతిని పురస్కరించుకొని భగవద్గీతలోని 12, 15 అధ్యాయాలపై పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చామర్తి గోపాలాచార్యులు, మిమిక్రీ శ్రీనివాస్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. బలగలోని హరేరామ మందిరంలో గీతా జయంతిని పురస్కరించుకొని సామూహి గోవింద నామాలకు, విష్ణు సహస్రనామ పారాయణ, సంపూర్ణ భగవద్గీత పారాయణలు జరిగాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం క్రాంతి విద్యానికేతన్‌లో గీతా జయంతి కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా గీతా సారాంశము తెలిపేందుకు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుండ అమ్మడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా లేకుంటే అంతే..!



చిలకపాలేం వైపు వేళ్లే జాతీయ రహదారిపై వెలగని ఎల్ఈడీ లైట్లు



కింతలిమిల్లు సమీపంలో పార్కింగ్ చేసి ఉన్న లారీలు



కేశవరావుపేట సమీపంలో కర్రల లోడు చేసిన లారీలు

జాతీయ రహదారిపై ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా రాత్రులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. కుశాలపురం బైపాస్ కూడలి, నవ భారత్, కింతలిమిల్లు, చిలకపాలేం వంటి కూడళ్లలో ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై లారీల పార్కింగ్, జాతీయ రహదారిపై ఎల్ఈడీ లైట్లు సక్రమంగా వెలగకపోవడం సమస్యలుగా మారాయి. అందువలన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్